అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- కుక్కునూరులో పింఛన్ల పంపిణీ



పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి

కుక్కునూరు: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్న ప్రభుత్వానికి దక్కుతుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బాలరాజు, పోలవరం నియోజకవర్గ సమన్వయ కర్త తెల్లం రాజ్యలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరై అవ్వ, తాతలకు పింఛన్‌లు, విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రలో హామీ ఇచ్చిన ప్రకారం జగనన్న అవ్వ తాతలకు పింఛన్‌ను రూ.3 వేలు అందిస్తున్నారన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటిని పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు ఎన్నడూ లేనివిధంగా విద్యారంగానికి పెద్దపీట వేసి అక్షరాస్యతలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టారన్నారు. ఇచ్చిన హామీలనే కాక ఇవ్వని వాటిని కూడా నెరవేర్చిన జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా చేసే విధంగా పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగరవేసి జగనన్నకు గిఫ్ట్‌గా ఇవ్వాలన్నారు. తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జగనన్నకు పేదలంటే ఇష్టమన్నారు. పేదలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలనే ఇన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అటువంటి జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా చేసి రాజన్న రాజ్యాన్ని తెచ్చుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వ్యాఖ్యానించారు. ఎన్నికల ముందు నక్కలు, తోడేళ్లు పోగై ప్రజలను మోసం చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారని వారి మోసాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పోలవరం నియోజకవర్గ అభ్యర్థిగా నిర్వాసితుల సమస్యలన్నింటిని నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. నియోజవర్గంలో బాలరాజు చేసిన అభివృద్ధిని చూసే నియోజకవర్గ ప్రజలు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. ఈ సారి ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే పోలవరం నియోజకవర్గ అభివృద్ధిని మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, వైస్ ఎంపీపీలు తాండ్ర రాజేష్, గాడిద రామచంద్రం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గంగుల రమణారెడ్డి, మాదిరాజు వెంకన్నబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, రావు వినోద్, పరవా రామిరెడ్డి, ఎల్లంకి లక్ష్మణ్‌రావు, రాయి రవి, పోలగాని వెంకట్రావు, కోటగిరి నళినిప్రవార్, సర్వా శ్రీహరి, అమరవరపు శ్రీనివాస్, దేవర సత్యనారాయణ, చిలకాల దుర్గాప్రసాద్, షేక్ బాజీ, తోట జయబాబు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్యదేవుని హుండీ ఆదాయం లెక్కింపు



హుండీలో నగదును లెక్కిస్తున్న దృశ్యం

లింగపాలెం: రాష్ట్రంలో రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన లింగపాలెం మండలం రంగాపురంలో వేంచేసిన శ్రీసత్యన్నారాయణస్వామి ఆలయంలో సోమవారం హుండీ ఆదాయన్ని లెక్కించారు. గత ఐదు నెలలకు సంబంధించి సత్యదేవుని హుండీ నగదును లెక్కించగా రూ.5,05,517 కానుకల రూపంలో ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

కన్నాపురం విద్యార్థికి ప్రతిభా పురస్కారం



కొల్లంశెట్టి వెంకట సత్యశ్రీ మేఘనకు అవార్డు అందజేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామానికి చెందిన విద్యార్థి కొల్లంశెట్టి వెంకట సత్య శ్రీ మేఘనకు ప్రతిభ పురస్కారం లభించింది. అంతర్జాతీయ తెలుగు మహాసభలు పురస్కరించుకొని ఆంధ్ర సారస్వతి పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో రాజమండ్రిలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో మేఘన ఈ అవార్డు అందుకున్నట్లు విద్యార్థి తండ్రి రామచంద్రమూర్తి సోమవారం పేర్కొన్నారు. ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మేఘన గత ప్రథమ సంవత్సరానికి కళాశాల టాపర్‌గా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా మేఘన ప్రతిభ పురస్కారం అందుకుంది.

చిరవెల్లిలో ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

కుక్కునూరు: మండలంలోని చిరవెల్లి హైస్కూల్‌లో సంతూర్ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మహిళలు , విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని రంగవల్లులతో పోటీపడ్డారు. జి.నవ్య, జి.హారిక, పి.శ్రీవర్ష వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందారు. కార్యక్రమంలో సంతూర్ డిస్ట్రిబ్యూటర్ ఎస్ లక్ష్మణస్వామి, ఎస్‌ఓ రవి, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కుక్కునూరు జెడ్పీ చంద్రమోహన్, ప్రెసిడెంట్ సోంబాబు, సెక్రటరీ ఎస్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీటీసీ వెంకట సత్యనారాయణ

కామవరపుకోట: హాస్టల్ విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించాలని ఎంపీటీసీ బొల్లు వెంకట సత్యనారాయణ అన్నారు. మండలంలో సోమవారం స్థానిక బీసీ బాలుర వసతిగృహాన్ని ఆయన సందర్శించారు. హాస్టల్లో మంచినీటి సదుపాయం, ప్రభుత్వ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

రాయపరాజుకు నివాళులు



రాయపరాజుకు నివాళులు అర్పిస్తున్న జెడ్పీటీసీ బాబ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మాజీ వార్డు సభ్యులు గొట్టుముక్కల రాయపరాజు చిత్రపటానికి సోమవారం జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాయపరాజు నివాసానికి వెళ్లి ఆయన కుమారుడు వంశీరాజు, కుటుంబసభ్యులను నాయకులు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. నాయకులు కర్రా శ్రీధర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య, కౌన్సిలర్ లోకారపు వెంకటేశ్వరరావు, నౌడు నూకరాజు, నౌడు సత్తిబాబు, ఎం శ్యామ్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

వైభవంగా సింహాసనం ఉత్సవం



గోదావరికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస కార్యక్రమంలో భాగంగా సోమవారం గోదా సమేత శ్రీకృష్ణ పెరుమాల్‌కు సింహాసన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసంలో 23వ రోజు గోదాదేవి శ్రీకృష్ణుని సింహాసనంపై ఆశీనుడై ఉండగా, తన విన్నపము స్వీకరించమని ప్రార్థిస్తుందని, అందువలన స్వామి వారికి సింహాసనం ఉత్సవం నిర్వహిస్తారని ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు తెలియజేశారు. ఈవో మానికల రాంబాబు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు దీపోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జగన్ పాలనలో అందరికీ సంక్షేమం

- వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి
- వేలేరుపాడులో పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న తెల్లం రాజ్యలక్ష్మి

వేలేరుపాడు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి అన్ని ప్రాంతాలకు, అన్ని వర్గాల ప్రజలకు అందజేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో తాట్కూరుగొమ్ము సర్పంచ్ కట్టి ఉదయ్‌కిరణ్ అధ్యక్షతన జరిగిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధి ప్రదాత వైఎస్ జగనన్న గురించి ఎంత మాట్లాడినా తక్కువే, అన్నారు. విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత కల్పించడంతోపాటు రైతుభరోసా, చేయూత, అమ్మఒడి, డ్వాక్రా సంఘాల రుణమాఫీ లాంటి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ఎవరి సిఫార్సులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని అన్నారు. అవినీతి రహితంగా పథకాలు అందించాలన్న ఉద్దేశంతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం అవ్వ, తాతలకు అందించే పింఛన్‌ను రూ.3 వేలకు పెంచారని, సంక్రాంతి పండుగకు ముందే పింఛన్లు ఇవ్వడం వల్ల గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందన్నారు. అనంతరం నూతన పెన్షన్‌లను రాజ్యలక్ష్మి పంపిణీ చేశారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తా

పోలవరం నిర్వాసితుల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, వైస్ ఎంపీపీలు కేసగాని వెంకటేశ్వరమ్మ, మేడవరపు నాగశ్రీ, ఎంపీటీసీ కొమ్మరాజు రాంబాబు, తాట్కూరుగొమ్ము, కట్కూరు సర్పంచ్‌లు కట్టి ఉదయ్‌కిరణ్, లక్ష్మణ్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కేసగాని శ్రీనివాసగౌడ్, కామినేని వెంకటేశ్వరరావు, మండల సచివాలయ కన్వీనర్ కొలూరి సత్తిరాజు, కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే షౌకత్‌హుస్సేన్, జిల్లా మైనార్టీ సెల్ నాయకులు ఎస్‌కే బాజీ, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



వైఎస్సార్ సీపీ నాయకులు బీవీఎస్ రెడ్డి గెస్ట్‌హౌస్ వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

లింగపాలెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ సీట్లు, ఒక ఎంపీ సీటును వైఎస్సార్ సీపీ గెలుపొందడం ఖాయమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం లింగపాలెంలో గెస్ట్ హౌస్ వద్ద వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బీవీఎస్ రెడ్డిని దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులై మరలా వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం జగన్ పాలనతో ప్రజలకు సంక్షేమ రాజ్యం కొనసాగుతుందన్నారు. రెండోసారి జగన్మోహనరెడ్డి సీఎం కావడం ఖాయమన్నారు. కుల, మత, వర్గ భేదం లేకుండా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనను దేశంలోని ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. నేడు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పి విజయబాబు, లింగపాలెం, ధర్మాజీగూడెం సొసైటీల చైర్మన్లు భీమిరెడ్డి సోమిరెడ్డి, ఉప్పలపాటి వరప్రసాద్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, యడవల్లి, అన్నపనేనివారిగూడెం సర్పంచ్‌లు కె రమేష్, డి రవీంద్ర, పార్టీ నాయకులు బి.ప్రభాకరెడ్డి, రావి కొండయ్య, పి వేమనరెడ్డి, నూతులపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పట్టాలు తయారు చేసినవారిపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న సాలి రాజశేఖర్

జంగారెడ్డిగూడెం: భూమిని అన్యాక్రాంతం చేసి నకిలీ పట్టాలు తయారుచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జంగారెడ్డిగూడెంకు చెందిన సాలి రాజశేఖర్ బాబు అధికారులను కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. జంగారెడ్డిగూడెంలోని సర్వే నెంబర్ 266/2బి1లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమి ఒక వ్యక్తి నకిలీ పట్టాతో అనుభవిస్తున్నాడన్నారు. సదరు పట్టా నకిలీదని తహసీల్దార్ గుర్తించినప్పటికీ ఆ వ్యక్తిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని, సదరు భూమిలో ఇది ప్రభుత్వ భూమి అని ఎటువంటి సైన్ బోర్డు పెట్టలేదన్నారు. 449లో గల అసైన్డ్ భూమి సైతం అన్యాక్రాంతం అయ్యిందన్నారు. కావున అధికారులు వెంటనే స్పందించి నకిలీ పట్టాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకుని, సదరు ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని కోరారు.

స్పందనలో 22 అర్జీలు

జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం 22 అర్జీలు అందినట్లు ఆర్డీవో కార్యాలయ అధికారులు తెలిపారు. ఈ అర్జీల్లో కామవరపుకోట మండలం గొల్లగూడానికి చెందిన తలారి ప్రకాష్ వనసంరక్షణ సమితికి చెందిన భూముల్లో చెట్లను నరికివేస్తున్నారని చర్యలు తీసుకోవాలని కోరారు. తన కుమారుడి భూమిని తప్పుడు డాక్యుమెంట్లతో ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కంతేటి మునేశ్వరరావు, సింహాద్రి నాగమణి వితంతు పింఛన్ ఇప్పించాలని, దివ్యాంగురాలినైన తనకు దేవులపల్లి గ్రామంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును ఇప్పించాలని, దిప్పకాయలపాడులోని చెరువు, కాలువ గట్టును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ నాయకులు కోరుతూ దరఖాస్తులు అందజేశారు.

ఎస్సై సెలెక్షన్స్‌లో స్టేట్ ర్యాంకర్‌కు సత్కారం



సూర్యచంద్రరావుపేటలో విజయభాస్కరరావును సత్కరిస్తున్న బాబు, తదితరులు

ద్వారకాతిరుమల: ఇటీవల విడుదలైన ఏపీ పోలీస్ ఎస్సై సెలక్షన్స్ ఫలితాల్లో స్టేట్ రెండవ ర్యాంక్ సాధించిన మండలంలోని సూర్యచంద్రరావుపేట గ్రామానికి చెందిన గౌనబోయిన విజయ భాస్కర రావును అదే గ్రామానికి చెందిన ఏలూరు సర్ సీఆర్‌ఆర్ పీజీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వీఆర్‌ఎస్ బాబు యలమర్తి సోమవారం ఘనంగా సత్కరించారు. బాబుతో పాటు ఉపాధ్యాయులు రాజు, జి.రవీంద్ర బాబు, తేర ప్రసాద్, ఎం.ఉపేంద్ర, డాక్టర్ టి.రాజేష్ ముందుగా విజయ భాస్కరరావు ఇంటికి వెళ్లి ఆయనకు దుశ్శాలువా కప్పారు. అనంతరం మొక్కను అందించి సత్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ విజయ భాస్కరరావు ఎస్సై సెలక్షన్స్‌లో స్టేట్ రెండవ ర్యాంక్ సాధించి యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. విజయ భాస్కరరావు తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ ఆయనను ఎంతో కష్టపడి చదివించారని, దానికి ప్రతిఫలం దక్కిందని అన్నారు. విజయ భాస్కరరావు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త వహించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు, బాలికలు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియా ద్వారా అపరిచిత వ్యక్తులు పంపే లింకులను లేదా సందేశాలను ఓపెన్ చేస్తే మన రహస్య సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు తస్కరిస్తారని ఏలూరు దిశ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.విశ్వం హెచ్చరించారు. స్థానిక ఆదివారపుపేటలో ఉన్న ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య హైస్కూల్‌లో దిశ యాప్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, సోషల్ మీడియా వల్ల కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన చర్యలను గురించి దిశ మహిళా ఎస్సై కాంతి ప్రియతో కలిసి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న వారు దిశ యాప్ కలిగి ఉంటే పోలీసు వారు వెంట ఉన్న భరోసా కలుగుతుందని, టోల్ ఫ్రీ నెంబర్ 112, డయల్ 100కు ఫోన్ చేసినా వెంటనే పోలీసులు బాధితుల చెంతకు చేరుతారని స్పష్టం చేశారు.

వలంటీర్లకు అభినందనలు



రాజమండ్రిలో దుర్గమ్మకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భవానీ



చేబ్రోలులో తులసికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఫణీంద్ర

జంగారెడ్డిగూడెం రూరల్: వలంటీర్లు అందిస్తున్న సేవలకు ప్రశంసలు అందుకుంటున్నారు. మండలానికి చెందిన ఇద్దరు వలంటీర్లు దూర ప్రాంతాల్లో ఉంటున్న పింఛన్‌దారుల వద్దకు వెళ్లి పింఛన్ నగదును సోమవారం అందజేశారు. మానసిక సమస్యతో చేబ్రోలులో కుటుంబ సభ్యుల వద్ద ఉంటున్న సీహెచ్ తులసికి లక్కవరానికి చెందిన వలంటీర్ ఫణీంద్ర చేబ్రోలు వెళ్లి రూ.3వేల పింఛన్ నగదును అందజేశారు. అలాగే రాజమండ్రిలో జీఎస్ఎల్‌లో చికిత్స పొందుతున్న బంటుమిల్లి దుర్గమ్మకి లక్కవరానికి చెందిన వలంటీర్ కంభపు భవానీ రూ.3వేల పింఛన్ నగదును అందజేశారు. ఇద్దరు వలంటీర్లను ఎంపీపీ కొదమ జ్యోతి, లక్కవరం సర్పంచ్ గెల్లా వెంకట రమణ అభినందించారు.

కోలాటం వంటి కళలను ప్రోత్సహించాలి



కోలాటం గురువు సిరికొండ సుబ్బారావును సత్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి: కోలాటం వంటి కళలను ప్రోత్సహించాలని తపన ఫౌండేషన్ ప్రతినిధి రఘు అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో రేచర్ల కోలాటం గురువు సిరికొండ సుబ్బారావు ఆధ్వర్యంలో శ్రీ రాధాకృష్ణ కోలాటం బృందం వారి గజ్జపూజ కార్యక్రమం ఆదివారం జరిగింది. కోలాటం గురువు సిరికొండ సుబ్బారావు, వాయిద్య కళాకారులు హనుమంతరావు, ప్రసాదులను శాలువాతో సత్కరించి తపన ఫౌండేషన్ వారి జ్ఞాపిక గోడ గడియారం అందజేశారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని కోలాట కార్యక్రమాన్ని వీక్షించారు. యాదవ సంఘం అధ్యక్షుడు కాట్రు బాలు యాదవ్, కొమ్మసాని ప్రసాద రెడ్డి, చివట ఆంజనేయులు, రవి, వీరమల్ల మధు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

జంగారెడ్డిగూడెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా. ఎస్.ప్రసాద్ బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్లీవజోజి, మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, ఎంఈవోలు రాముడు, రాములు పాల్గొని ఓటు ప్రాముఖ్యతను వివరించారు. ఓటును ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆటోవాలాల నిరసన



వినతిపత్రం సమర్పిస్తున్న ఆటోవాలాలు

కొయ్యలగూడెం: మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం పథకం అమలు వద్దు అంటూ సోమవారం కొయ్యలగూడెంలో మండల ఆటో వర్కర్స్ అండ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఈ పథకాన్ని అమలు చేస్తున్న రాష్ట్రాలలో ఆటోవాలాల జీవితాలు రోడ్డున పడ్డాయని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టే ఏ ప్రభుత్వమైనా ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని విరమించుకోవాలన్నారు. ఒకవేళ పథకాన్ని అమలు చేయదలుచుకుంటే ముందుగా ఆటోవాలాల జీవనోపాధికి ప్రభుత్వం కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొవ్వూరు రోడ్డులోని అభయ ఆంజనేయస్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పాశం నాగమణి, ఎంపీడీవో ఆర్.బేబీశ్రీలక్ష్మిలకు వినతిపత్రం సమర్పించారు.

దళిత ఉద్యమ నేత బండి ఆశీర్వాదం మృతి



బండి ఆశీర్వాదం (ఫైల్)

చింతలపూడి: ప్రముఖ దళిత ఉద్యమ నేత ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కేంద్ర కమిటీ కార్యదర్శి బండి ఆశీర్వాదం(92) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆశీర్వాదంను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆశీర్వాదం మృతిపట్ల ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

బాలరాజుకు వినతిపత్రం అందజేత

కుక్కునూరు: పింఛన్‌ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజుకు, వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మికి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అంగన్‌వాడీ వర్కర్లు వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సరైనది కాదన్నారు. తమ సమస్యలను బాలరాజుకు వివరించారు. దీంతో స్పందించిన ఆయన అంగన్‌వాడీ సమస్యల పరిష్కారం దిశగా తన వంతుగా ప్రభుత్వానికి తెలియజేస్తానని పేర్కొన్నారు.